# నువ్వు తెచ్చిన మల్లెపూలు


ఉలిటి సులేఖ

“ఆకాశంలో సగం నువ్వు. కాదు, ఆకాశం అంతా నువ్వే! నా చిన్ని ప్రపంచం అంతా నువ్వే!”

ఏమైపోయాయి ఆ మాటలు?

ఆకాశం... మౌనం... సముద్రం... సంగీతం... నక్షత్రం... చిర్నవ్వు... సెలయేరు... నీ పాట! ఇలా ఎన్నో పదాలు! ఎన్నో అందాలు! భావాలకి మాత్రమే చేరువై, మాటలకి దూరమై!

ప్రస్తుతం నీకూ, నాకు మధ్య ఉన్నంత దూరమై! అవునూ ఎందుకంత దూరం మనమధ్య?



అప్పట్లో నీరెండలో వెన్నెల తళుక్కుమనేది. ఒకే దుప్పటి కింద మనమిద్దరం! నువ్వు తెచ్చిన మల్లె పూలకి వాసనెక్కువ! నిజం సుమీ! ఇప్పుడా పరిమళా లెక్కడివి?

దీనికి ఎవర్ని నిందిద్దాం? నిన్నా? నన్నా? మిలియన్ డాలర్ల ప్రశ్న! డాలర్లే జవాబు చెప్పాలంటావా? ఎన్ని డాలర్లు పోసినా మల్లెల గుబాళింపు కొనుక్కోగలనా?

మన జీవిత చిత్రం ఎంత గమ్మత్తుగా తిరగబడింది? పగటి పక్క మీద నేను, రాత్రి దుప్పట్లో నువ్వు!

మన మధ్య మనస్పర్థలేం లేవు. కొట్లాటలంత కన్నా లేవు. పోనీ అలా అని చిలిపి తగాదాలూ అంటే వాటికి చోటెక్కడిది? నిన్ను చూసి చాన్నాళ్ళయింది. ఒకే ఇంట్లో ఉంటూ అపరిచయస్తుల్లా! ఎంత ఆశ్చర్యం! యీ వింత బయటివాళ్ళకే గానీ మన కొలీగ్స్‌కి కాదులే!

ఎందుకింత హడావిడి? ఏం సాధిస్తున్నాం? ఎటు పోతున్నాం?

పాపకి నీ వంట నచ్చలేదంట. స్కూల్ క్యాంటిన్ లోనే తింటుందంట!

యీ నెలలో బహుశా మనం కలిసే అవకాశాలు లేవేమో? ఇంతకీ అంత ఎడబాటు అవసరం అంటావా?

ఓహ్! చెప్పడం మరిచాను మన పాతిక లక్షల ఫ్లాట్ రడీ అయిందంట. ఇంక మనం 'మూవ్' అవ్వడమే తరువాయి. 'మూవ్' అంటే గుర్తొచ్చింది మన పాపకి ఇంగ్లీష్ బాగా వచ్చేసింది మనకి మల్లే! యాస కూడా అదే! వాళ్ళ ఆంగ్లోమిస్సు చెప్పిందంట ఇల్లు 'షిఫ్ట్' అవ్వడం కాదు 'మూవ్' అవ్వడం అనాలి'' అని! నాకే ఇంగ్లీషు నేర్పేటంత ఎదిగిపోయిందనుకో!

ఓ మాట చెప్పనా? 'వన్ ఆర్ నన్' అన్న స్లోగన్ వింటాన్కి బానే ఉంది కానీ నాకే ఎందుకో నచ్చలా! మనకి ఇంకో 'చైల్డ్' ఉంటే బాగుంటుందనిపిస్తోంది. పాపకో తోడు వద్దంటావా? అఫ్‌కోర్స్ మనకి 'టైమింగ్స్' కుదరవనుకో.

''లీవిట్, ఫర్‌గెటిట్'' అని నువ్వంటావు. నిజమే. కానీ మనకి పరిచయమయిన కొత్తలో... ఆ మధుర క్షణాల్ని ఎలా మర్చిపోయుంటావు?

'స్వీట్ నథింగ్స్'ని మెమొరి చిప్స్‌లో దాచేసి 'చిప్స్' మాత్రమే వింటూ టైమ్‌ని సద్వినియోగం చేసుకుంటూ(?) కొన్నాళ్ళకి 'జంక్‌ఫుడ్'లా తయారవుతానేమోనన్న భయం ఒక్కొక్కప్పుడు!

యీరోజు స్వాతంత్ర్య దినోత్సవం. నువ్వో విషయం గమనించావా? ఇంగ్లీషు వాళ్ళు అప్పుడోరకంగా మన స్వాతంత్ర్యాన్ని ఎగరేసుకుపోతే యిప్పుడు కాస్తా 'రిఫైన్డ్'గా తన్నేసుకుపోతున్నారు!

మన ముందు డాలర్లు 'డాగ్ బిస్కెట్ల'లా! అప్పుడూ మనం వాళ్ళ కాళ్ళకింద పన్చేశాం. ఇప్పుడూ షరా మామూలే! అయితే కాస్త తేడా! వాళ్ళ 'పగళ్ళ'ని మన 'రాత్రుళ్ళ'తో అనుసంధానం చేసి, ఇడ్లీ, దోసెల్ని పక్కకి తోసి, పిజ్జా, బర్గర్‌ల సంస్కృతిని మనతో భారతీయం చేసేసి! మరీ అంత 'వెస్టర్నైజేషన్' అవసరమంటావా? కాకపోవచ్చు, కానీ మిలియన్ డాలర్లు మాత్రం అవసరమే అంటావు. ఎందుకంటే మనం యీతరం ప్రతినిధులం కదూ?

తెల్లవెధవలకి అస్సలు జ్ఞానం లేదంట. బొత్తిగా కామన్‌సెన్స్ కరువంట. వాళ్ళ భాషలో కూడా మన వాళ్ళకే 'పెర్‌ఫెక్షనం'ట!

ఏమైనా కానీ ప్రపంచమంతా 'గ్లోబల్ విలేజ్' అయిపోనీ! దేశాల మధ్య దూరం తరిగిపోనీ. కానీ మనమధ్య దూరం పెరిగిపోతోంది చూడు అదే నాకొద్దు!

ఒకే చూరుకింద వున్న భార్యాభర్తలం మనం. మన మధ్య అంత దూరాన్ని పెంచేసుకుంటూ, ప్రపంచానికి దగ్గరవ్వడంలో అర్థమేమన్నా ఉందంటావా?

డబ్బు అవసరమే కాదనను, కానీ ప్రేమ కూడా అంతే అవసరం కాదంటావా? ఎందుకో నాకేడుపొస్తోంది. యీ కాల్‌సెంటర్ ఉద్యోగాలు మనకొద్దు. కనీసం సెల్‌ఫోన్‌లలో సయితం మాట్లాడుకోటాన్కి నోచుకోని బతుకులు మనవి.

మనం ఇద్దరమే కూర్చుని వెన్నెలని దోసిట్లో పోసుకున్న రోజులు! ఇంద్రధనుస్సుని వంచేసి నా వడ్డాణంగా నువ్వు చుట్టేసిన క్షణాలు! నీ నవ్వులతో పొట్లాలు కట్టి నా గుండె అరల్లో దాచేసిన ఘడియలు! అవేం, అసలేం గుర్తురావడంలా? ఎంత సాఫ్ట్‌వేర్‌తో తన్నుకులాడుతున్నా నా మనసెందుకో హార్డ్‌వేరై మొరాయిస్తోంది.

మొన్నామధ్య, నా పక్క సీట్లో ఉంటుందే, 'సరోజ' అదేలే 'సారా' తన బాయ్‌ఫ్రెండ్‌తో తెగతెంపులై దిగాలుగా కూర్చుంటే, 'అనిల్' అదే 'ఏన్', సన్నటి, పొడవాటి అబ్బాయి లేడూ, ఎప్పుడూ నవ్వుతూ, తుళ్ళుతూ ఉంటాడే అతను, ప్రపోజ్ చేశాడు.

అతనికీ ఓ గాళ్‌ఫ్రెండ్ ఉందిలే అయినా టైమింగ్స్ కుదరక కలవడం అవ్వడం లేదంట. అందుకే 'సారా'తో స్నేహం కావాలంటాడు. ఎక్కువ సమయం 'కాల్‌సెంటర్'లో ఉండాల్సిందే కాబట్టి సారాతో డేటింగ్ ప్రిఫర్ చేశాడంట. ఒకవేళ తన గాళ్‌ఫ్రెండ్ కలిసినా ఆమెతోనూ ఉంటాట్ట! కానీ అది అప్పుడప్పుడు ఉంటుందంట! బహుశా ఆర్నెల్లకో మారు ఉండవచ్చుట! అతని మాటల్లో లాజిక్కుకి నా తల తిరిగింది!

జీవితం చాలా చిన్నది! కాలాన్ని వృథా చేస్కోకు! ట్రాఫిక్ జామ్‌లో కొంత, ఆఫీసు పనుల్లో కొంత, మన పర్సనల్ పనులకి కొంత ఇలా కొంత... కొంత... వేస్కుంటూ పోతే మనకంటూ ఎంజాయ్ చెయ్యటాన్కి మిగిలేది చాలా కొద్ది సమయం. ఆ కొంచెం సమయాన్ని ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురు చూస్తూ వృథా చేసుకోవడంలో అర్థం ఉందని నేనను కోను. ఏ క్షణానికి ఆ క్షణమే శాశ్వతం! ఇదీ అతని ఉవాచ! వాళ్ళ కాంట్రాక్ట్ ప్రకారం (కాల్‌సెంటర్) ఆఫీస్ అవర్స్‌లో వాళ్ళిద్దరూ 'లివ్ టుగెదర్ కపుల్!' ఆఫీస్ బయట మాత్రం ఎవరి జీవితం వారిదే! నాకిదంతా కొత్తగా అనిపించిది. అదే మాట అతనితో అంటే ''థేంక్స్! చెత్తగా అనిపించనందుకు!'' అని నవ్వేశాడు.

'లైఫ్‌ని అంత క్యాజువల్‌గా తీసుకుంటాడు కాబట్టే నేనూ అతనితో 'డీల్'(?!)కి ఒప్పుకున్నాను' అంది సారా నిన్న సాయంత్రం.



జీవితం చాలా చిన్నది! కాలాన్ని వృథా చేస్కోకు! ట్రాఫిక్ జామ్‌లో కొంత, ఆఫీసు పనుల్లో కొంత, మన పర్సనల్ పనులకి కొంత ఇలా కొంత... కొంత... వేస్కుంటూ పోతే మనకంటూ ఎంజాయ్ చెయ్యటాన్కి మిగిలేది చాలా కొద్ది సమయం.

'మరి అతని గాళ్‌ఫ్రెం
అని నేనడిగితే 'అదంతా నాక
నాతో ఉన్నంతసేపు నన్ను
షంగా ఉంచుతాడు. ఒక 'ఓట
('హెచ్' సైలెంట్) మూసేశాడని వేరే 'ఓటల్'కి వెళ్ళడం మానేస్తావా? కడుపు కాల్చుకోంగా! ఇదీ అంతే. జీవితాన్ని ఓ కొత్త కోణంలో చూపించింది సారా. ఎందుకో ఆ పోలిక నాకంతగా నచ్చలా. ఆకలేసిందని సింహం గడ్డి తినదుగా! పోన్లే నా అభిప్రాయాలు నావి.

ఇవన్నీ నీకెందుకు చెప్తున్నానంటే 'ఏన్' అన్న ఆ ఒక్క మాట నన్ను బాగా భయపెడ్తోంది. అతనేమన్నాడో తెలుసా? ఏ ఇద్దరి మధ్య అయినా చాలాకాలం ఎడబాటు వస్తే, మనసారా మాట్లాడుకోకపోతే, వాళ్ళ మధ్య దూరం పెరిగిపోయి కొన్నాళ్ళకి ఎదుటివారి రూపం మదిలో పూర్తిగా 'డిలేట్' అయిపోతుందంట!

అదిగో ఆ గ్యాప్ మన జీవితాల్లోకి కూడా వచ్చిపడుతుందేమోనని బెంగ! ప్లీజ్ మనకీ 'కాల్‌సెంటర్' ఉద్యోగాలు వద్దు! నాది మౌనరోదనేనా నీకేమైనా అర్థమవుతోందా?

ఎందుకో మరి నా మనసు పొరల్లో దాచుకున్న జ్ఞాపకాల పుస్తకపు పుటలన్నీ వాటంతటవే తెరుచుకుంటున్నాయి! మది గదినిండా అనురాగపు అక్షరాలు అల్లుకుంటున్నాయి.

గుండె గవాక్షంగుండా వస్తోన్న అత్తరు గుబాళింపు నువ్వు తెచ్చిన మల్లెపూలని గుర్తు తెస్తోంది.

ఎందుకంటే నువ్వు తెచ్చిన మల్లెపూలకి వాసనెక్కువ!

***

''ఏంటీ? నీకీరోజు ఆఫీస్ లేదా?''

''ఊహూ, ఈరోజు మనం ఓ కొత్తచోటుకి వెళ్తున్నాం''

''ఏంటది?''

''అమ్మ ఒడి!''

''అంటే?''

''పద లోపలికి – ఈరోజునుంచీ ఇదే మన కొత్త, స్వంత ఆఫీస్. మన పాపలానే చాలామంది పిల్లలు పేరెంట్స్ ఉన్నా, అనాధల్లా, మత్తుగా నిద్రపోవడాన్కి మందులు పట్టేసే 'క్రెష్'లలో 'క్రష్' అయిపోతున్నారు. అందుకే కాల్‌సెంటర్ ఉద్యోగస్తుల పిల్లలకు కేర్‌సెంటర్. ఇదే మన 'డే-కేర్'. ఈరోజునుండి మన పాపకి అన్నా, చెల్లీ, అక్కా, తమ్ముడు అంతా ఉన్నారు. నీకు నేనున్నాను. మనకి పిల్లలున్నారు! మనది 'గ్లోబల్ విలేజ్!'

జీవితం చాలా చిన్నది. అందుకే ప్రేమలో ఆనందంగా గడిపేద్దాం. నీలో 'ఫ్రస్టేషన్' నేనర్థం చేస్కోగలను!

అతడి కళ్ళల్లో భావాలకి ఆమె కళ్లు చెమ్మగిల్లాయి! మనసు, మనసుతో మమేకమైతే 'కమ్యూనికేషన్ గ్యాప్' ఎక్కడిది!

★